సాక్షి
శ్రీకాకుళం

శనివారం : 21 : అక్టోబర్ : 2023

న్యూస్‌రీల్

నేడే ప్రత్యేక లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రమాద, రెవెన్యూ కేసుల రాజీ కోసం శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మోటార్ ప్రమాదాల కేసుల పిటీషనర్ అడ్వకేట్లు, బీమా కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్‌తో సమావేశం నిర్వహించి లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని సూచించారు.

నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో బోధన సిబ్బంది నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదలకు అధికారులు సిద్ధమవుతున్నారు. 99 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖ, పాలక మండలి, అకడమిక్ సెనేట్ అనుమతులు తీసుకున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ పక్కాగా రోస్టర్ సిద్ధం చేసి విడుదల చేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ మూడు కేటగిరీలు, బ్యాక్‌లాగ్ పోస్టులు మరో కేటగిరీగా నోటిఫికేషన్ విడుదల చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ బోధకులు లేకపోవడం సమస్యగా ఉంది. ప్రస్తుతం బయోటెక్నాలజీలో ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు నలుగురు, సోషల్ వర్క్‌లో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎకనామిక్స్‌లో ఒక ప్రొఫెసర్ ఏడుగురు మాత్రమే రెగ్యులర్ బోధకులు ఉన్నారు. దరఖాస్తుల స్వీకరణ, నియామక ప్రక్రియ వంటి పూర్తి వివరాలు నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నారు.

'సన్నకారు రైతులను ప్రోత్సహించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులకు మొక్కలు నాటే కార్యక్రమం, పెంపకంలో ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ జాయింట్ డైరెక్టర్, ప్రత్యేకాధికారి ఎం.అశోక్ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం డ్వామా కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేయాలన్నారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక ప్రక్రియ ప్రస్తుతం జరుగుతున్నందున ఈ పనుల కోసం లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. చెరువు గట్లు, ప్రభుత్వ భూములు గుర్తించి బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టడం ద్వారా గ్రామంలోని పేదవారికి ఆదాయం కల్పించవచ్చని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు వాటర్ హార్వెస్టింగ్ పనులను ఎక్కువగా నిర్మించాలని సూచించారు.

సంతబొమ్మాళిలో ఎలుగుబంటి సంచారం



రహదారిపై తిరుగుతున్న ఎలుగుబంటి

సంతబొమ్మాళి: మండలం కేంద్రంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఎలుగు బంటి ప్రధాన రహదారిపై హల్‌చల్ చేసింది. కొంతమంది యువకులు ఎలుగు రహదారిపై తిరుగుతున్న దృశ్యాలను సెల్ కెమెరాలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.


కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: రిమ్స్‌లో కొత్తగా మంజూరైన 18 పోస్టులకు గాను కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ విధానంలో నియామకాలకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా డీఎంహెచ్ఓ బి.మీనాక్షి ప్రకటనలో తెలియజేశారు. స్టాఫ్ నర్స్ –14 పోస్టులు, సపోర్టింగ్ స్టాఫ్ (ఎల్‌జీఎస్)-4 పోస్టులకు సంబంధిత అర్హతలతో అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డీఎంహెచ్ఓ కార్యాలయానికి సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం.ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సేవలు భళా..

ఫలిస్తున్న విస్తరణ కల

- విస్తరిస్తున్న డీసీసీబీ సేవలు
- ఇకపై సహకార బ్యాంకుల్లో ఈ స్టాంప్ విక్రయాలు
- రెండో దశలో స్టాంప్ డ్యూటీ కలెక్షన్
- రాష్ట్రంలో కడప తర్వాత శ్రీకాకుళం డీసీసీబీకి దక్కిన అవకాశం



డీసీసీబీకి చేరుకున్న ఈ స్టాంప్ ముద్రణ యంత్రాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ప్రగతి దిశగా అడుగులు వేస్తోంది. ఓ వైపు జనాలకు సేవలతో చేరువవుతూనే, ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషిస్తోంది. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుండడంతో డీసీసీబీ కలల దారిలో పయనిస్తోంది. తాజాగా ఈ స్టాంప్ పేపర్ల విక్రయాలు, స్టాంప్ డ్యూటీ కలెక్ట్ చేసే బాధ్యతను డీసీసీబీకి ప్రభుత్వం అప్పగించింది. తొలుత కడప డీసీసీబీకి అనుమతులివ్వగా, తాజాగా శ్రీకాకుళం డీసీసీబీకి అనుమతి ఇచ్చింది. దశల వారీగా ఈ స్టాంప్ విధానం అమల్లోకి రానుంది.

తొలిసారిగా ఈ స్టాంప్ సేవలు

ప్రస్తుతం ఈ స్టాంప్ పేపర్ల విక్రయాలు రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లోనూ, మీ సేవా కేంద్రాల్లోనూ జరుగుతున్నాయి. స్టాంప్ డ్యూటీని ఒక్క స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మాత్రమే కట్టించుకుంటోంది. స్టాంప్ పేపర్ల విషయంలో పక్కన పెడితే స్టాంప్ డ్యూటీని చెల్లించే విషయంలో వినియోగదారులు కాస్త ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వస్తోంది. ఎస్‌బీఐ ఒక్కటే ఆప్షనే ఉండటంతో అక్కడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఆ సేవలందించేందుకు ముందుకొచ్చింది. ప్రభుత్వ అనుమతి మేరకు తొలి దశలో ఈ స్టాంప్ పేపర్ల విక్రయాలు చేపట్టనుంది. రెండో దశలో స్టాంప్ డ్యూటీ కలెక్ట్ చేసే సేవలు అందించనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సేవల విస్తరణ

ముందుగా 12 బ్రాంచ్‌ల్లో ప్రారంభం కానున్న ఈ స్టాంప్ సేవలు తర్వాత జిల్లాలోని మిగతా 15 బ్రాంచ్‌ల్లో కూడా జరిపేందుకు డీసీసీబీ యంత్రాంగం చర్యలు తీసుకుంది. అందుకు తగ్గ ఏర్పాట్లు కూడా చేస్తోంది. సాధ్యమైనంత వరకు సేవలు విస్తృతం చేసి ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో డీసీసీబీ అడుగులు వేస్తోంది. సేవలు విస్తృతం చేసుకుని తద్వారా ఆదాయం పెంచుకోవాలని చూస్తోంది. ఇప్పటికే డీసీసీబీ లాభాల పట్టింది. ఒకప్పుడు నష్టాలతో కొట్టుమిట్టాడిన ఈ బ్యాంకు ప్రభుత్వం చేయూత ఇవ్వడంతో ఆర్థికంగా నిలబడింది. అప్పటినుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఫైనాన్స్ చేసి పటిష్టం చేసింది. రైతులకు రుణాలు, ఇతరత్రా సహకారం అందిస్తోంది. చివరికి పీఏసీఎస్‌లకు లాభాలు పంచిపెట్టే స్థాయికి ఎదిగింది. రాష్ట్రంలోనే టాప్‌లో నిలబడింది. తాజాగా ప్రభుత్వం అనుమతిచ్చిన ఈ స్టాంప్ విక్రయాలు, స్టాంప్ డ్యూటీ కలెక్ట్ చేసే బాధ్యతతో ప్రజలకు మరింత చేరువకానుంది. అదే విధంగా ఆదాయం కూడా పెరగనుంది.

మంచి అవకాశం

మన డీసీసీబీకి ఈ స్టాంప్ విక్రయాలు, స్టాంప్ డ్యూటీ కలెక్ట్ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించడం మంచి పరిణామం. సహకార బ్యాంకుల సేవలు ప్రజలకు మరింత చేరువ కానున్నాయి. రాష్ట్రంలో తొలుత కడపకు అనుమతి ఇవ్వగా, రెండో అవకాశాన్ని మన డీసీసీబీకి ఇవ్వడం గర్వించదగ్గ విషయం. డీసీసీబీ ఆర్థికంగా పరిపుష్టి సాధించడానికి మరింత దోహదపడుతుంది. ఈ స్టాంప్ పేపర్ల విక్రయాలు, స్టాంప్ డ్యూటీ కలెక్ట్ చేసే సేవలు అందించేందుకు బ్యాంకు పరంగా అన్ని ఏర్పాట్లు చేశాం. త్వరలోనే సేవలు ప్రారంభించనున్నాం.

– కరిమి రాజేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్, శ్రీకాకుళం

తొలుత 12 బ్రాంచ్‌ల్లో విక్రయాలు



ఈ స్టాంప్ నమూనా

ఈ స్టాంప్ పేపర్ల విక్రయాలు, స్టాంప్ డ్యూటీ కలెక్ట్ చేసే బాధ్యతను రాష్ట్రంలో తొలిసారిగా కడప డీసీసీబీకి అప్పగించగా, తాజాగా శ్రీకాకుళం డీసీసీబీకి అప్పగించింది. ఇందుకు సంబంధించిన మిషన్లు ఇప్పటికే జిల్లాకు వచ్చేశాయి. తొలి దశలో 12 డీసీసీబీ బ్రాంచ్‌ల్లో ఈ స్టాంప్ సేవలు ప్రారంభం కానున్నాయి. శ్రీకాకుళం, బలగ, నరసన్నపేట, పలాస, సోంపేట, పాలకొండద, రాజాం, పాతపట్నం, ఆమదాలవలస, టెక్కలి, రణస్థలం, కోటబొమ్మాళి బ్రాంచ్‌లలో ఈ స్టాంప్ పేపర్ల విక్రయాలు జరగనున్నాయి. కొన్ని రోజుల తర్వాత ఈ బ్రాంచ్‌ల్లోనే స్టాంప్ డ్యూటీ కలెక్షన్ కూడా చేయనున్నారు.

'డ్రగ్స్ వినియోగంతో జీవితాలు నాశనం'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాదక ద్రవ్యాల వినియోగం జీవితాన్ని నాశనం చేస్తుందని, యువత వీటికి దూరంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో సమష్టి సహకారం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా ఎస్పీ, సభ్యులుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, డీఈఓ, డీఎంహెచ్, జిల్లా వ్యవసాయాధికారి కొనసాగుతారన్నారు. లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. డ్రగ్స్ వినియోగంపై ఎలాంటి సమాచారం ఉన్నా స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా తరచూ గంజాయి వినియోగం వల్ల జరిగే అనర్థాలపై సదస్సులు నిర్వహించాలన్నారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా గంజాయి సాగు లేదని, వాటి వినియోగం, రవాణాపై గట్టి నిఘా ఉంచామని స్పష్టం చేశారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో లాడ్జిల్లో తనిఖీలు నిర్వహించి కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ జేడీ ఎన్.మణికంఠ, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర రావు, టెక్కలి సబ్ కలెక్టర్ నూర్ కుమార్, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతి, పలాస ఆర్డీఓ సీతారామ్మూర్తి, ఏడీ డ్రగ్ కంట్రోలర్, శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ శృతి, టెక్కలి డీఎస్పీ డి.బాల చంద్ర రెడ్డి, కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వర రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ కె.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్ జగన్‌తోనే బహుజన సాధికారత సాధ్యం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో బహుజనుల సంక్షేమం, వారి ప్రగతి, అన్ని రంగాల్లో సాధికారత సీఎం వైఎస్ జగన్ పాలనతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కలెక్టరేట్ వద్ద శుక్రవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. బహుజనులకు రాజకీయ అవకాశాలు ఇచ్చిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుతున్న ప్రభుత్వ తమదేన్నారు. పాఠశాలలు, ఆస్పత్రులు బాగు చేశామని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల వారు అవమానాలకు గురయ్యారని తెలిపారు. న్యాయమూర్తులుగా బీసీలు పనికిరారని ఆయన లేఖ రాసిన అంశాన్ని గుర్తు చేశారు. సమస్యలు చెప్పుకుందామని వచ్చిన నాయీ బ్రాహ్మణులను ఉద్దేశించి తోకలు కట్ చేస్తామన్నారని, మత్స్యకారులకు తోలు తీస్తామన్నారని, ఎస్సీలుగా పుట్టేందుకు ఎవరు కోరుకుంటారంటూ బాబు వ్యాఖ్యలు చేశారని తెలిపారు. మోడరన్ అన్‌టచ్‌బులిటీకి చంద్రబాబు నిదర్శనమని అన్నారు. కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ అధ్యక్షుడి హోదా ఏనాడైనా అనుభవించారా అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో పాఠశాలలు, ఆస్పత్రులు నిర్వీర్యమయ్యాయని తెలిపారు. నాడు క్యాబినెట్‌ను మోసం చేసి చంద్రబాబు డబ్బులు కొట్టేశారని తెలిపారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు పాత్రపై రామోజీరావు ఎందుకు వార్తలు రాయడం లేదని ప్రశ్నించారు.

మూడు రోజులు వానలకు అవకాశం



ఆమదాలవలస: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఇది వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ బి. మౌనిక శుక్రవారం తెలిపారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అక్టోబర్ 21 ఉదయం నాటికి బంగాళాఖాతం మధ్య భాగాల మీద అల్పపీడనం ఏర్పడుతుందని తెలిపారు. తర్వాత అదే మరింత బలపడి అక్టోబర్ 23వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని అన్నారు. దీని ప్రభావంతో శనివారం, ఆదివారం, సోమవారాల్లో ఉత్తర కోస్తా ప్రాంతంలో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని చెప్పారు. నైరుతి రుతుపవనాలు ఆగిపోయాయని, మూడు నాలుగు రోజుల్లో ఈశాన్య రుతుపవనాల ఆగమనంపై స్పష్టత వస్తుందన్నారు.

కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.20 లక్షలు



కొత్తమ్మతల్లి హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: కొత్తమ్మ తల్లి ఉత్సవాల సమయంలో వచ్చిన హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. హుండీల ద్వారా రూ.20,12,242 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. గత ఏడాది ఉత్సవాల ఆదాయం కంటే ఈ ఏడాది రూ.3,69,957 ఎక్కువ వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోంపేట దేవదాయశాఖ తనిఖీ అధికారి ప్రసాదబాబు, ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవీకృష్ణ, ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జేడీ సూర్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయం మరమ్మతులు పూర్తయ్యాయి.రాష్ట్ర పాడి, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మరమ్మతుల కోసం రూ.15లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆధునికీకరణ చేసిన కార్యాలయాన్ని ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు సూర్యం శుక్రవారం ప్రారంభించారు. ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన వెంటనే కార్యాలయాన్ని ప్రారంభించడంపై కార్యాలయ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

విద్యారంభం కరిష్యామి

చదువుల తల్లి సాక్షిగా బుజ్జాయిలు తొలి అక్షరాన్ని లక్షణంగా రాశారు. కన్నవారి ఒడిలో కూర్చుని మంత్రాక్షరాలను ముద్దుగా దిద్దారు. ఆలయాల్లో అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరించారు. అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అక్షరాభ్యాసాలతో పాటు తల్లికి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.





పీఎన్ కాలనీలో సామూహిక అక్షరాభ్యాసాలు (ఇన్‌సెట్లో) శ్రీకాకుళంలో సరస్వతీ మాతగా విజయదుర్గ



బాలత్రిపుర కాలభైరవ స్వామి పీఠం దేవాలయంలో సహస్ర కమలాలతో అర్చనలు



చిన్నారికి అక్షరాలు దిద్దిస్తున్న దృశ్యం

'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం'కు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ వై.విశ్వమోహన రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలహీనమైన వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు ప్రభుత్వం 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' అనే కొత్త పథకంతో ప్రయోజనాలు అందిస్తోందని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ దరఖాస్తులకు యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.1,00,000 నగదు ప్రోత్సాహకం, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.80,000 నగదు ప్రోత్సాహకం అందిస్తారని తెలిపారు. 2023లో నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన వారుమాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. jnanabhumi.ap.gov.in పోర్టరులో వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొవాలని తెలిపారు. నవంబర్ 4లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు



అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి 6వ స్థాయీ, 11 గంటల నుంచి 3వ, 12 గంటల నుంచి 5వ, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 2వ, 3 గంటల నుంచి 4వ, 4 గంటల నుంచి 7వ, సాయంత్రం 5 గంటల నుంచి 1వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. అయితే వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి నివేదికలను తాజా వివరాలతో వెంట తీసుకురావాలని, సభ్యులు అడిగిన ప్రతి అంశానికి తగిన సమాధానం, పరిష్కారం ఇచ్చేలా అధికారులు సన్నద్ధం కావాలని సీఈఓ సూచించారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో తెలంగాణ ఎంపీ ప్రభాకర రెడ్డి



ఆదిత్యుని జ్ఞాపికను ఎంపీకి అందజేస్తున్న కృష్ణమాచార్యులు, శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని తెలంగాణ రాష్ట్రం మెదక్ లోక్‌సభ సభ్యుడు కొత్తా ప్రభాకరరెడ్డి శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేషనల్స్ గేమ్స్‌కు అంపైర్‌గా 'బాడాన'



నారాయణరావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్ఠాత్మక నేషనల్ గేమ్స్‌కు అంపైర్‌గా జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ బాడాన నారాయణరావు నియామకమయ్యారు. ఈ మేరకు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈనెల 29 నుంచి గోవా వేదికగా జరిగే 37వ నేషనల్స్ గేమ్స్‌లో అథ్లెటిక్స్ క్రీడాంశంలో పోటీల నిర్వహణకు అంపైర్ (టెక్నికల్ అఫీషియల్)గా ఆయనను నియమించారు. బాడాన నారాయణరావు జెడ్పీహెచ్‌స్కూల్ చాకిపల్లి(టెక్కలి మండలం)లో ఫిజికల్ డైరెక్టర్ (ఎస్‌ఏ పీఈ)గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా నారాయణరావును జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తన చాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, బీవీ రమణ, కె.మాధవరావు, చాకిపల్లి హెచ్ఎం ఎం.అనూరాధ, పీడీలు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు డొంకూరు విద్యార్థులు



రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడా పోటీలకు ఎంపికైన డొంకూరు విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఇచ్ఛాపురం మండలం డొంకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం జె.సరోజిని శుక్రవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు తిరుపతి జిల్లా యాదమరి వేదికగా జరుగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో వై.లోకేష్, వై.చరణ్, వై.గోపీ, వై.భవానీలు శ్రీకాకుళం జిల్లా తరఫున ఆడనున్నట్లు కోచ్ వజీర్ అహ్మద్ తెలిపారు. విద్యార్థులకు వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, సర్పంచ్ బుడ్డ మోహనాంగి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఉద్యోగుల స్పందనకు 9 అర్జీలు



వినతులను స్వీకరిస్తున్న డీఆర్ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనకు 9 వినతులు అందాయి. ఉద్యోగులు స్పందనకు వచ్చే ముందు సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని రావాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి చెప్పారు. ప్రతి నెల మూడో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై శుక్రవారం కలెక్టరేట్‌లో స్పందన నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు వివిధ సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. జీత, భత్యాలు అందలేదని, సీనియారిటీ, పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, తదితరమైన సమస్యలపై అర్జీలు స్వీకరించారు. జిల్లా స్థాయిలో అర్జీలు వస్తే సంబంధిత అధికారులకు పంపుతామని, రాష్ట్ర స్థాయిలో వచ్చిన అర్జీల సమస్యలను ప్రభుత్వానికి పంపుతామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235

ఇంటర్ ఫెయిలైన విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్



జిల్లా ఆర్ఐఓ కార్యాలయం (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న జిల్లా ఆర్ఐఓ పి.దుర్గారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థుల రీ–అడ్మిషన్, పరీక్ష ఫీజు చెల్లింపు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు ప్రాంతీయ మండలి జిల్లా పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) పి.దుర్గారావు తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2024 మార్చిలో నిర్వహించనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు గడువును ఇంటర్‌బోర్డు నవంబర్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు, డ్రాప్ అవుట్ అయిన జనరల్, ఒకేషనల్ విద్యార్థులు జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో గతంలో చదివిన కళాశాల ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

రీ అడ్మిషన్ పొందితే ప్రభుత్వ పథకాలు

ఫెయిలైన విద్యార్థి వారికి ఇష్టమైన కళాశాలలో రీ–అడ్మిషన్ పొంది అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దాన్ని పరిగణనలోకి తీసుకుంటారని ఆర్ఐఓ దుర్గారావు అన్నారు. సప్లిమెంటరీ/ఫెయిల్ అనే పదం లేకుండా ఒకేసారి నేరుగా ఉత్తీర్ణులయ్యారనే పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారని వెల్లడించారు. రీఅడ్మిషన్ పొందిన విద్యార్థులకు జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, మొదలగు ప్రభుత్వ పథకాలు కూడా వర్తిస్తాయని ఆర్ఐఓ స్పష్టంచేశారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు కల్పించిన ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, సిబ్బంది ఫెయిలైన విద్యార్థి ఇంటికెళ్లి రీ అడ్మిషన్/పరీక్ష ఫీజు చెల్లించేలా చేయాలన్నారు. వారు పరీక్షలకు సన్నద్ధులయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో గత విద్యా సంవత్సరంలో 168 జూనియర్ కళాశలల్లో ఫెయిలైన విద్యార్థులు సుమారు 6 వేల మంది వరకు ఉన్నట్టు ఆయన చెప్పారు.

డిజి లాకర్లలో సర్టిఫికెట్లు..

ఇంటర్ పాసైన విద్యార్థుల కోసం ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అందుబాటులో ఉన్నాయని ఆర్ఐఓ పి.దుర్గారావు తెలిపారు. 2014 నుంచి 2023 మధ్య సంవత్సరాలలో పాసైన విద్యార్థుల సర్టిఫికెట్లను డిజి లాకర్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ బోర్డుకు కల్పించిందన్నారు. విద్యార్థులంతా డిజి లాకర్ యాప్‌ను సెల్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్ట్రేషన్ పొందిన తర్వాత వారికి అవసరమైన సర్టిఫికెట్లు పొందవచ్చని ఆయన వివరించారు.

శివారుకు నీరందించాలి



వ్యవసాయ మండలి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

- పంట నమోదు, ఈకేవైసీ వేగవంతం కావాలి
- మంత్రి సీదిరి అప్పలరాజు



పాల్గొన్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం చేయగలమో నివేదికలు రూపొందించాలని, శివారుకు కచ్చితంగా నీరు అందించాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశించారు. జిల్లా నీటిపారుదల సలహా మండలి 30వ సమావేశం, జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు మాసంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు గత 120 ఏళ్లలో ఎన్నడూ లేవని, ఈ సమస్య జిల్లాలోనే కాకుండా దేశవ్యాప్తంగా వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి దీనిపై రెండు సార్లు సమీక్షలు నిర్వహించారని గుర్తుచేశారు. జిల్లాలో సాగునీటి సమస్యల పరిష్కారంలో ఇంజినీరింగ్ అధికారులు కారణాలు చెప్పవద్దని, పరిష్కారం చూపాలని కోరారు. నీటి పారుదల అధికారుల తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం దోహదపడుతుందని మంత్రి తెలిపారు. శివారుకు నీరు అందాకే, ఎత్తిపోతల పథకాలకు నీరివ్వాలని సూచించారు. రానున్న రెండు వారాలు శివారు భూములపై అధికారులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సాగునీటి సరఫరాలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు తమకు సమర్పిస్తే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం వ్యవసాయంపై సమీక్షిస్తూ జిల్లాలో ఈ–క్రాప్ పంట నమోదు, ఈకేవైసీ తక్కువగా ఉందని, దీనిపై వ్యవసాయాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి పంటలను వేసేలా ప్రత్యామ్నాయ మార్గాలపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి ముఖ్యమైన పనుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. వంశధార నుంచి అందిస్తున్న సాగునీటిలో లష్కర్లు, గుర్రపు డెక్క సమస్యల పరిష్కారం కోసం జిల్లా నిధులు మంజూరు చేస్తున్న సంగతిని గుర్తు చేశారు. ప్రముఖ అపరాల శాస్త్రవేత్త ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పంట మార్పిడి పద్ధతి చాలా అవసరమన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమల రావు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి కె. శ్రీధర్, కోరమండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జీవి సుబ్బారెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మెన్ గొండు కృష్ణమూర్తి, నీటి పారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, నీటి పారుదల శాఖ అధికారులు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు'



మాట్లాడుతున్న వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): గత నలభై ఐదు రోజులుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల వంశధారలో సమృద్ధిగా నీరు లేకపోవడం వల్ల శివారు ప్రాంతాలకు నీరు అందించలేకపోతున్నామని బీఆర్ఆర్ వంశధార సర్కిల్ ఎస్ఈ డోల తిరుమలరావు 'సాక్షి'కి తెలిపారు. జిల్లాలో వంశధార ఎడమ కాలువ పరివాహక శివారు ప్రాంతాలైన గార, పోలాకి, సంతబొమ్మాళి, నందిగాం, పలాస ప్రాంతాల్లో ఉన్న సుమారు 15వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు. శివారు ప్రాంతాలకు ముందున్న రైతులు లిఫ్ట్ స్కీమ్‌ల ద్వారా నీటిని తోడేస్తున్నారని, దీంతో శివారు ఆయకట్టుకి నీరు అందడం లేదన్నారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కొన్ని రోజుల పాటు జిల్లాలో వంశధార కాలువలపై ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకు విద్యుత్ సరఫరా నిలిపివేసి వారబందీ పద్ధతిలో నీటిని సరఫరా చేస్తామన్నారు. కాలువల్లో గుర్రపుడెక్క తీసేందుకు కలెక్టర్ నిధులతో పనులు చేసి కొంచెం రైతులకు నీరు అందించగలిగామన్నారు. కాలువల ఆధునికీకరణ, షట్టర్ల మరమ్మతులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. కలెక్టర్ ఐఏబి సమావేశం పెట్టి వాస్తవ పరిస్థితులు ప్రజాప్రతినిధులకు, రైతులకు తెలియజేస్తే బాగుంటుందన్నారు.

బ్యాటరీ బైక్‌లో మంటలు



మంటల్లో కాలిపోయిన బ్యాటరీ స్కూటీ

సోంపేట: సోంపేట పట్టణంలోని గాంధీ మండపం సమీపంలో ఎస్వీ కలర్స్ యజమాని బత్తుల షణ్ముఖరావు బ్యాటరీ స్కూటీలో శుక్రవారం మంటలు చెలరేగి బండి కాలిపోయింది. దుకాణ దారులు తెలిపిన వివరాల మేరకు బ్యాటరీ బండి తన షాప్ పక్కన పార్క్ చేసి ఉండగా ఒక్కసారిగా వాహనం నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే స్పందించి మంటలు అదుపులోకి తేవడానికి ప్రయత్నించినా బండి మొత్తం కాలిపోయినట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ఆక్రందన దీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడాల తమ్మినాయుడు, సనపల వెంకట రమణ మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాలిక ఆర్థిక బకాయిలైన పీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ, 11వ పీఆర్సీ, ఆర్జిత సెలవుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆక్రందన దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ పనులకు విరామం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో జంట పట్టణాలను కలిపే కేటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ పనులు కొంత మేర శుక్రవారంతో ముగిశాయి. మూడు రోడ్ల కూడలి నుంచి పలాస ఇందిరమ్మ కూడలి వరకు జరిగిన పనుల్లో 11 కేవీ లైన్ పనులు, పొడవైన విద్యుత్ స్తంభాల అమరిక శరవేగంగా చేపట్టారు. ఈ సందర్భంగా పలాస విద్యుత్ డీఈ జి.ప్రసాదరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ గార రాజారావు పర్యవేక్షించారు. విజయదశమి సందర్భంగా ముఖ్యపనులు ముగిసినప్పటికీ మిగిలిన పనులకు విరామం ఇస్తున్నామని, మిగిలిన పనులు దసరా అనంతరం తిరిగి పనులు మొదలు పెడతామని వెల్లడించారు.

అధిక వేగం.. తల్లిదండ్రులకు శోకం

- రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి
- హెల్మెట్ లేకపోవడమే మృతికి కారణం



కుమారుడి మృతదేహం వద్ద తల్లి రోదన



మృతి చెందిన రెడ్డి ప్రవీణ్ (ఫైల్)

రణస్థలం: వేగంగా బండి నేర్చుకోవాలనే తపన, వేగాన్ని నియంత్రించలేని నిస్సహాయత, హెల్మెట్ ధారణపై అవగాహన లేమి.. కలగలిపి ఓ బాలుడి ప్రాణాలను బలికొన్నాయి. వాహనం నడపడం నేర్చుకునేందుకు బైక్ తీసిన బాలుడు రోడ్డుపైకి వచ్చి ప్రాణాలు కోల్పోయాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బంటుపల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం 4.45 గంటల సమయంలో బీరు ఫ్యాక్టరీ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రెడ్డి ప్రవీణ్(14) మృతి చెందాడు. బాలుడు నడుపుతున్న బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పైడి భీమవరంలో ఉంటున్న ప్రవీణ్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్నేహితుడి వద్ద బైక్ తీసుకుని రణస్థలం వైపు సర్వీసు రోడ్డులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాలుడి తండ్రి శేఖర్ పైడిభీమవరంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నారు. తల్లి భవాని గృహిణి. అక్క భవ్య పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతోంది. ప్రవీణ్ కోష్టలోని సక్సెస్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వీరి స్వగ్రామం విజయనగరం జిల్లా లక్కవరపు కోట మండలంలోని తామరపల్లి. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. జేఆర్ పురం ఎస్ఐ జి. రాజేష్ కేసు నమోదు చేశారు.

ఇంటి నిర్మాణం మరింత సులువు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- సర్క్యులేషన్ పద్ధతిలో ఇళ్ల నిర్మాణానికి చర్యలు
- ఈ విధానం అమలు చేస్తున్న తొలి కార్పొరేషన్‌గా శ్రీకాకుళం
- మీడియా సమావేశంలో రెవెన్యూ మంత్రి ధర్మాన వెల్లడి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇంటి నిర్మాణాల అనుమతులు మరింత సులువు చేస్తూ, సంబంధిత సవరణలను ఆమోదిస్తూ సర్క్యులేషన్ ప్యాట్రన్ అమలుకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. దీనికి శ్రీకాకుళం కార్పొరేషన్ ప్రజల తరఫున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రోడ్డు తక్కువ వెడల్పు ఉన్నా భవన నిర్మాణ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేందుకు సంబంధిత ప్రణాళికల్లో నియమ నిబంధనలలో మార్పులు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ఈ సర్క్యులేషన్ ప్యాట్రన్ అమలు అనేది శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లోనే మొదలైందన్నారు. రోడ్డు వెడల్పు 30 అడుగులు ఉన్నా, లేకపోయినా పది అడుగులు కంటే తక్కువ ఉన్న చోట కూడా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అక్కడున్న భవన యజమానులు రహదారికి వీలున్నంత మేర స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణాలను చేసుకునే విధంగా నిబంధనల్లో మార్పులు చేశామన్నారు. నగరంలో తొలి విడతగా 23 ప్రాంతాల్లో పలు వీధుల్లో ఇందుకు సంబంధించి ఇప్పటికే రోడ్ల వెడల్పుపై నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు సాగించాలంటే గతం మాదిరిగా కాకుండా అక్కడున్న రోడ్డు వెడల్పుకు అనుగుణంగా బిల్డింగు నిర్మాణ దారులు స్థలం వదిలే విధంగా ఇప్పటి నిబంధనలు మార్చినట్లు తెలిపారు. కిమ్స్‌రోడ్డులో గ్రీన్‌జోన్‌ను ఎత్తివేసి కమర్షియల్ నిర్మాణాలకు పూర్తిస్థాయి అనుమతులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆ జీఓ త్వరలో రానుందన్నారు.

కొత్త కలెక్టరేట్

జిల్లా కేంద్రంలో కొత్త కలెక్టరేట్ 3 లక్షల అడుగుల్లో నిర్మిస్తున్నామని తెలిపారు. స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, మరికొద్ది రోజుల్లో పూర్తవుతుందన్నారు. మార్కెట్‌తో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో రోడ్లు శరవేగంగా చేస్తున్నామన్నారు. శ్రీకాకుళం నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కాలనీలో రోడ్లు, కాలువలు, శానిటేషన్ వంటి పనులు పూర్తిచేస్తున్నామన్నారు. సర్క్యులేషన్ పేట్రన్ వల్ల ఇంటి నిర్మాణం సులువైందన్న విషయాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఏసిపిలు హరిబాబు, రమణమూర్తి, ఎంవీ పద్మావతి, చల్ల శ్రీను, కోణార్క్ శ్రీను, మండవల్లి రవి, లైసెన్సుడు ఇంజినీర్లు హారికా ప్రసాద్, ముని శ్రీనివాసరావు, దుంగ సుధాకర్, చల్ల అలివేలు మంగ, పొన్నాడ రుషి, అల్లు లక్ష్మీనారాయణలతో పాటు పలువురు లైసెన్సుడు ఇంజినీర్లు పాల్గొని మంత్రి ధర్మానకు కృతజ్ఞతలు తెలిపారు.

'బాల్య వివాహాల నిర్మూలన మన బాధ్యత'



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాల్య వివాహాల నిర్మూలన అందరి సామాజిక బాధ్యత అని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా 'బాల్య వివాహ రహిత భారత దేశం, బాలల భద్రతే భారత్ భద్రత' నినాదంతో జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ అందరి కృషితో 57 బాల్య వివాహాలను ఆపగలిగామని తెలిపారు. బాల్య వివాహాల వచ్చే అనర్థాలు, బాల్య వివాహాలు చేస్తే పడే శిక్ష గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహంపై సమాచారాన్ని 112 లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబర్‌కు తెలియజేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికట్టేలా రూపొందించిన కర పత్రికలను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి సన్యాసి నాయుడు, అదనపు ఎస్పీ విఠలేశ్వర్, ఐసీడీఎస్ పీడీ శాంతి శ్రీ, జెడ్పీ సీఈఓ వెంకట రామన్, రమణ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, గ్రామ సచివాలయ ప్రత్యేక అధికారి వాసుదేవరావు, డీపీఆర్ చెన్న కేశవ, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

మెళియాపుట్టి: మహిళ హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు పడిందని స్థానిక ఎస్ఐ రాజేష్ తెలిపారు. జోడూరు గ్రామ పరిసర ప్రాంతంలోని ఆఫ్‌షోర్ కాలువ వద్ద 2019లో ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందన్నారు. అప్పటి వీఆర్ఓ అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు, అప్పటి సీఐ రవిప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్ఐ సిద్ధార్థ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారని చెప్పారు. మృతురాలిని సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన దండు జయంతిగా గుర్తించారని, ఒడిశాకు చెందిన రమేష్ అనే వ్యక్తి జయంతిని చంపేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ కేసులో సోంపేట అదనపు జడ్జి భాస్కర రావు వాదోపవాదాలు విని ముద్దాయికి రూ.2వేల జరిమానా, జీవిత ఖైదు విధించినట్లు తెలిపారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



ఘటనాస్థలిలో విచారణ చేస్తున్న డీఎస్పీ శృతి



మృతుడు గురుమూర్తి (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్: వినాయక అనుపు ఉత్సవం సమయంలో జరిగిన దాడిలో గాయపడి 15 రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందిన లావేటి గురుమూర్తి (34) అనే వ్యక్తి శుక్రవారం కన్నుమూశారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని మహలక్ష్మినగర్ సమీపంలో తూర్పు గుమ్మాళ్ల వీధిలో లావేటి గురుమూర్తి (34) భార్య విజయకుమారి, కుమార్తె అంజలి, కుమారుడు అఖిల్‌లతో కలిసి ఉండేవారు. ఆయన కారుడ్రైవింగ్‌కు వెళ్తుండేవారు. ఈ నెల 1వ తేదీన వీధిలో వినాయకుని ఊరేగింపు కోసం విజయకుమారి పిల్లలను పంపించారు. డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన గురుమూర్తికి ఇంట్లో పిల్లలు కనిపించకపోవడంతో భార్యను అడిగారు. ఊరేగింపుకు వెళ్లారని చెప్పడంతో అక్కడకు వెళ్లి పిల్లలను తీసుకువస్తుండగా అదే వీధికి చెందిన వంశీ గురుమూర్తిని అడ్డగించాడు. ఇదేమని గురుమూర్తి ప్రశ్నించగా వంశీ కొట్టడమే కాకుండా అతని అనుచరులు సాయి, మోహన్, వేణులతో కలిసి అమానుషంగా దాడి చేయించాడు. అంతటితో కాకుండా గురుమూర్తిని కింద పడేసి ఛాతీపై, పొత్తికడుపులో కాళ్లతో తన్నారు. దీన్ని గమనించిన విజయకుమారి అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఆమె దుస్తులు లాగి ఈడ్చుకుని వెళ్లిపోయారు. విజయకుమారి మేనమామ సింహాద్రి రాజశేఖరం అడ్డుకునేందుకు ప్రయత్నించగా అతనిపై కూడా దాడి చేసి అంతుచూస్తామని బెదిరించారు. దాడిలో తీవ్రగాయాలపాలైన గురుమూర్తిని అతని కుటుంబసభ్యులు అదేరోజు రిమ్స్‌లో చేర్పించారు. 24 గంటల పాటు రిమ్స్‌లో చికిత్సపొందిన గురుమూర్తిని ఈనెల 2న ఇంటికి తీసుకొచ్చారు. అక్కడే ఔట్‌పోస్టు పోలీసులు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఇంటికొచ్చిన గురుమూర్తి ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో కుటుంబసభ్యులు జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు.

ఈ క్రమంలో 15 రోజుల పాటు చికిత్స పొందిన గురుమూర్తి గురువారం రాత్రి తన ఇంటికి వచ్చేశారు. శుక్రవారం వేకువజామున ఐదు గంటలకు మృతిచెందారు. దీనిపై మృతుని భార్య విజయకుమారి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ యర్రగుంట శృతి, సీఐ ఎల్ సన్యాసినాయుడు, ఎస్ఐ బి.గణేష్ సంఘటనా స్థలికి చేరుకున్నారు. దీనిపై దళిత సంఘాల నాయకులు జి.అప్పారావు, తదితరులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ వై.శృతి ఈ కేసును విచారిస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నారు.